## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

కష్టసుఖములెల్ల కలుగుట తప్పదు
మనిషిజీవితమున మంచిచెడులు
సాగిపొమ్ము వాని సమముగా భావించి
భవితయంత నీకు బాగుబాగు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

----------------------

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 165 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 12-9-2025 పేజీలు -8 |




### బిల్లుల ఆమోదంలో గవర్నర్, రాష్ట్రపతిలకు

# నిర్దిష్ట గడువు

- కేసులో ముగిసిన విచారణ..
- తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెండింగ్ బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణీత సమయం లోపు ఆమోదం తెలపాలంటూ జరిగిన విచారణపై సుప్రీంకోర్టు తన తీర్పును గురువారం రిజర్వ్ చేసింది. ఈ అంశంపై దాదాపు 10 రోజులపాటు- సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. అనంతరం ఈ కేసులో తుది తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు- ప్రకటించింది. రాష్ట్రపతి కానీ,

-మిగతా 2 లో



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

- 10 మంది మావోయిస్టులు మృతి..!

**రాయ్‌పూర్ సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ ప్రాంతంలో గురువారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఇప్పటి వరకు పది మంది మృతి చెందినట్లు సమాచారం. ఇందులో ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోందం బాలకృష్ణ సైతం ఉన్నట్లు సమాచారం. రాయ్‌పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరించారు. గరియాబంద్‌లో భద్రతా దళాలు, నక్సల్స్ మధ్య ఎదురుకాల్పులు జరిగాయని.. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయని

-మిగతా 2 లో



## రష్యా సైన్యంలో చేరొద్దు..

- భారతీయులకు కేంద్రం కీలక సూచన

**న్యూఢిల్లీ,**
ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధం లో కొందరు భారతీయులు రష్యా సైన్యం తరపున పనిచేస్తున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధంలో రష్యా సైన్యం తమ తరపున పోరాడేందుకు బలవంతంగా వినియోగించుకుంటోందంటూ పలువురు బాధితులు ఇప్పటికే తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రం తాజాగా స్పందించింది. ఈ మేరకు కీలక సూచన చేసింది. రష్యా సైన్యం ఆఫర్లు ప్రమాదకరమని హెచ్చరించింది. భారతీయులు రష్యా సైన్యంలో చేరొద్దంటూ సూచించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.రష్యా సైన్యంలో భారతీయ పౌరులను నియమించుకున్నట్లు వస్తున్న నివేదికలు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు ప్రకటనలో తెలిపారు. రష్యా సైన్యంతో పనిచేయడం వల్ల కలిగే ప్రమాదాల గురించి ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు హెచ్చరించిందని చెప్పారు. రష్యా సైన్యంలో చేరేందుకు ఇచ్చే

-మిగతా 2 లో



### రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు

# పూర్తి చేయండి

**కొత్త లైన్లకు అవసరమైన భూసేకరణకు సిద్ధం**

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు
- పర్యాటక కేంద్రాలకు అనుగుణంగా రైల్వే లైన్లు
- శంషాబాద్ అమరావతి మధ్య గ్రీన్ కారిడార్
- రైల్వే అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు- ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు-

-మిగతా 2 లో




## యూరియా కృత్రిమ కొరతకు కాంగ్రెస్ కారణం

- జాబ్ క్యాలెంటర్ ప్రకటించిన నియామకాలు నిల్
- మీడియాతో బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు

**హైదరాబాద్**
కాంగ్రెస్ నాయకులు యూరియా కృత్రిమ కొరతను సృష్టించారని బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. కేంద్రం.. తెలంగాణ వాటా యూరియా ఎప్పుడో ఇచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా అమీర్ పేట్ లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి అంశంలోనూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గ్రూప్-1 అంశంలో న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని రామచందర్ తెలియజేశారు. గ్రూప్-1 అంశంలో టిజిపిఎస్సి తప్పుల మీద తప్పులు చేసిందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం కంటే ఎక్కువ సీట్లు- బిసిలకు ఇస్తామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు రాష్ట్ర కమిటీలో బిసిలకు చోటు దక్కలేదని విమర్శించారు. అధికార ప్రతినిధుల్లో వరంగల్ కు అవకాశం కల్పిస్తామని రామచందర్ రావు హామీ ఇచ్చారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఇండియా కూటమిలో ఐక్యత లేదని స్పష్టమైందని రామచందర్‌రావు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్లకు జీతాలు రావడం లేదు. యూనివర్సిటీ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో యూనివర్సిటీ-లను నడుపుతూ భావితరాలను అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.వెయ్యికోట్లు- ఇస్తానని సీఎం రేవంత్ గొప్పలు చెప్పారు. దావోస్‌కు

-మిగతా 2 లో



## అటవీ అధికారుల త్యాగం చిరస్మరణీయం

- విధి నిర్వహణలో వారి సేవలు అమోఘం
- అడవుల రక్షణ కోసంఎందరో ప్రాణత్యాగం
- అటవీ అమరుల దినోత్సవంలో మంత్రి సురేఖ

**హైదరాబాద్ సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ శాఖ అధికారుల త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నెహ్రూ జులాజికల్ పార్కులోఅటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిలతో కలసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11 వ తేదీన అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవటం జరుగుతుందని అన్నారు.

-మిగతా 2 లో


## హైదరాబాద్‌లో కుండపోత వర్షం

- విజయవాడ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్



**హైదరాబాద్ సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా.. నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపుర్ మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రామోజీ ఫిల్మ్‌సిటీ- పరిసర ప్రాంతాల్లో గంటన్నరపాటు- కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారిపై

-మిగతా 2 లో




## తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసిన కాంగ్రెస్ సర్కార్

- హైకోర్టు ఆదేశించినట్లు పరీక్షను మళ్లీ నిర్వహించాలి
- అవకతవకలపై జ్యుడిషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలి
- కేటీఆర్ ఎక్స్ వేదికగా డిమాండ్

**హైదరాబాద్**
గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణమయిందని చెప్పారు. హైకోర్టు ఆదేశించినట్లు పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.సర్కారు కొలువుకోసం ఏళ్ల తరబడి కష్టపడి తమ విలువైన సమయాన్నీ, అమ్మా, నాన్నల కష్టార్జితాన్నీ ధారపోసిపోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ముజేసింది ఈ కాంగ్రెస్ సర్కార్. అసమర్థత, కాసుల కక్కుర్తి కలగలిసి అనేక అవకతవకలకు కారణమయ్యింది. అంగట్లో కొలువులు అమ్ముకొని నిరుద్యోగుల గొంతుకోసింది. గ్రూప్ 1 పరీక్ష నిర్వహణలో ఫెయిల్ అయిన ఈ ప్రభుత్వాన్ని యువత ఎన్నటికీ క్షమించదు. హైకోర్టు ఆదేశించినట్టు గ్రూప్-1 పరీక్ష మళ్లీ తాజాగా నిర్వహించాలి. అవకతవకలపై జుడీషియల్ కమిషన్ వేసి ఉద్యోగాల దొంగలెవరో తేల్చాలి. ఏడాదిలోపే రెండు లక్షల

-మిగతా 2 లో

## నేడు రాధాకృష్ణన్

# ప్రమాణం చేసే ఛాన్స్

**హాజరుకానున్న మోడీ తదితరులు**

- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు
- మహా గవర్నర్‌గా రాజీనామా..
- గుజరాత్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఆయన ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేస్తారు. బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారు అయిందని తెలుస్తోంది. సీపీ రాధాకృష్ణన్ 15వ భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉపరాష్ట్రపతి చేత భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చురుగ్గా పూర్తి చేశారు. ప్రాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితర కేంద్ర మంత్రులు, విపక్ష నేతలు, ఇతర విఐపిలు హాజరయ్యే అవకాశం ఉంది. భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖడ్ రాజీనామా చేశాక జరిగిన ఎన్నికల్లో రాధాకృష్ణన్ విజయం సాధించారు. సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 148 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు-

-మిగతా 2 లో

## గొర్రెల స్కామ్ కేసులో ఈడి దూకుడు

- విచారణకు హాజరుకావాలని బాధితులకు నోటీసులు
- కోట్లు గోల్ మాల్ జరిగినట్లు గుర్తించిన ఈడి

2 లో



# బిల్లుల ఆమోదంలో గవర్నర్, రాష్ట్రపతిలకు నిర్దిష్ట గడవు

(మొదటి తరువాయి)

గవర్నర్లు కానీ బిల్లులు ఆమోదించకుండా పెండింగ్‌లో పెడితే.. ఆటోమెటిక్‌గా మూడు నెలల తర్వాత అవి ఆమోదం పొందినట్లేనంటూ గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇక ఈ తీర్పులోని అంశాలపై ఉన్నత న్యాయస్థానం రిఫరెన్స్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోరిన విషయం విదితమే. అయితే గతంలో తమిళనాడు కేసులో గవర్నర్లు నిరవధికంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచే అధికారం లేదని.. నిర్దిష్ట సమయంలోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ తీర్పు ప్రకారం.. కోర్టు నిజంగా అలాంటి -టైమ్ లైన్‌లు విధించే అధికారాన్ని కలిగి ఉందా?, గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలు న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయా? అనే అంశాలపై విస్తృత చర్చ జరిగింది. వాదనల సందర్భంగా కేంద్రం తరఫు న్యాయవాది.. ఇలాంటి సమయ పరిమితులు విధించడం రాజ్యాంగ సమతుల్యతను దెబ్బ తీయవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదించారు. అలాగే తమిళనాడు, కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలు మాత్రం ప్రజాస్వామ్య దేశంలో బాధ్యతగా గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయాలకు సమయం అవసరమని స్పష్టం చేశాయి. అయితే ఈ తుది తీర్పులో మాత్రం సుప్రీంకోర్టు.. గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై క్లారిటీ- ఇవ్వడమే కాకుండా.. ఈ తరహా బిల్లులు నిలిపివేత పై భవిష్యత్తులో అనుసరించాల్సిన మార్గదర్శకాలపైనా స్పష్టతనిచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ అంశం దేశంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అలాంటి వేళ సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశంపై ఎలాంటి తీర్పు వెలువరించనుందనే అంశంపై ఇండి కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఏలుబడిలోని రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నాయనే చర్చ సాగుతోంది.

# రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

(మొదటి తరువాయి)

కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీ-ని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు-, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సీఎంతో పాటు- ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు- అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ- నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు- చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు- చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్‌తో పాటు- రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్లను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్న్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు- చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండ్రస్టియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ- ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు- గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్తో పాటు- వరంగల్ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. శంషాబాద్ నుంచి చెన్నయ్ వరకు బుల్లెట్ ట్రైన్ కొత్త రైల్వే కనెక్టివిటీ- అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అటవీ అధికారుల త్యాగం చిరస్మరణీయం

(మొదటి తరువాయి)

ఇదే రోజు 1730 వ సంవత్సరంలో రాజస్థాన్ రాష్ట్రంలో బిష్ణోయి తెగకు చెందిన 360 మంది కేజ్రి చెట్లు- రక్షించుటకు తమ ప్రాణ త్యాగం చేసారని మంత్రి తెలిపారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విధినిర్వహణలో వన సంపద సంరక్షణ కొరకు జీవితములను త్యాగము చేసిన అటవీ సిబ్బంది సేవలను స్మరించుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 1984వ సంవత్సరము నుండి ఇప్పటివరకు 22మంది అటవీ సిబ్బంది ధైర్య సాహసాలతో అంకిత భావంతో పనిచేసి అటవీ నేరములకు పాల్పడిన నేరస్తులను పట్టు-కొనుటలో, అటవీ సంపద పరిరక్షణలో తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించినారని ఈ సందర్భంగా వారి అమూల్యమైన సేవలను గుర్తు చేశారు. అదేవిదంగా అడవులు మరియు వన్య ప్రాణులను రక్షించటంలో నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తమ శాయశక్తుల కృషి చేసి అటవీ రక్షణలో భాగంగా 2014 నుండి 2025 జూలై మాసం వరకు టేకు అలాగే మారు జాతి కలపకు సంబంధించిన నేరాలను అలాగే 10375 అటవీ భూ ఆక్రమణ కేసులను కూడా పెద్దసంఖ్యలో నమోదు చేయడం జరిగిందని అన్నారు. అలాగే 2025 సంవత్సరంలో రూ. 149.66 కోట్ల కలపకు గాను 96813 కేసులు నమోదు చేసి రూ.లు 51.50 కోట్ల జరిమానా వసూలు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 18002 వాహనములను కూడా స్వాధీనపరచుకోవడం జరిగిందని అన్నారు. నేరస్తులు తెలియని కేసులు 29858 (÷ఖఉక్ష) నమోదు చేసి రూ. లు 67.13 కోట్ల విలువ కలిగిన టేకు మరియు మారు జాతి కలపను స్వాధీనపర్చుకొని జప్తు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిదంగా అమూల్యమైన అటవీ సంపదను పరిరక్షించడానికి ప్రజల భాగస్వామ్యముతో ఎన్నో పథకాలను మరియు చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. 174 బేస్ క్యాంపులు, 62 చెక్ పోస్టులను ఏర్పాటు- చేయడము జరిగినదని పేర్కొన్నారు. అడవి సరిహద్దుల నిర్వహణకు పశువులు అడవిలో చొరబడకుండా నియంత్రించే కాలువలు నిర్మించడం, ?సాయుధ పోలీసు దళాలు కలప అక్రమ రవాణా అరికట్టడానికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. పి. డి. యాక్ట్ మేరకు టేకు అక్రమ రవాణాదారులను కూడా అరెస్టు చేయడం జరుగుతున్నదని, అటవీ శాఖ సిబ్బంది పోలీసు అధికారుల సాయముతో ఇపటివరకు (5) కేసులు నమోదు చేశామని అన్నారు. అటవీ శాఖ సిబ్బందిని మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేరస్తులకు కఠినమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. అదేవిదంగా అటవీ సంరక్షణ బలోపేతానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కొత్తగా 2118 వాహనాలు, (2008 మోటారు సైకిళ్ళు, ఎఫ్.బి.ఓ నుండి డి.ఆర్.ఓ వరకు, (110) మహీంద్ర తార్ జీపులు అటవీ క్షేత్రాధికారులకు అందించామని స్పష్టం చేశారు. ప్రభుత్వం 2022 సంవత్సరంలో (1516) రిక్రూట్‌మెంట్ కొరకు అనుమతి ఇచ్చిందని, అందులో భాగంగా (1393) ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు (15) మంది ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, (18) మంది ఏసిఎఫ్ ఇతర పోస్టులు రిక్రూట్‌మెంట్ పక్రియలోఉన్నాయని పేర్కొన్నారు. అడవుల రక్షణ మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడం కోసం అనేక సమగ్ర చర్యలు ప్రారంభించబడ్డాయని అలాగే వన్యప్రాణుల ఆవాసాలను మెరుగుపరచడానికి పలు కార్యక్రమాలు చేపట్ట ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం' సందర్భంగా అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలుపుతూ మృతుల కుటు-ంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియపరచి అమరుల స్తూపం వద్ద ఈ సందర్భంగా అమూల్యమైన నివాళులు అర్పించారు. అంతకుముందు అమరుల స్తూపం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని ఉన్నతాధికారులతో కలిసి మంత్రి స్వీకరించారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీమ్ అహ్మద్, పిసిసిఎఫ్ హెడ్ సువర్ణ, పిసిసిఎఫ్ వైల్డ్ లైఫ్ ఏలు సింగ్ మేరు, సి సి ఎఫ్ ప్రియాంక వర్గీస్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, వివిధ విభాగాల అధికారులు, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఫారెస్ట్ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, అమరుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల స్కామ్ కేసులో ఈడి దూకుడు

**విచారణకు హాజరుకావాలని బాధితులకు నోటీసులు**

**కోట్లు గోల్ మాల్ జరిగినట్లు గుర్తించిన ఇడి**

హైదరాబాద్

గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది. మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ.2కోట్లు- మేర మోసం చేసినట్టు- ఈడీ దృష్టికి వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు- ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. గొర్రెల స్కాంలో మోసపోయారంటూ ఇప్పటికే ఏపీకి చెందిన గొర్రెల కాపర్లు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 15న విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసులో ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుండగా.. ఏసీబీ విచారణ ఆధారంగా ఈడీ కూడా దర్యాప్తులోకి దిగింది. ఏపీకి చెందిన గొర్రెల కాపరులకు బ్రోకర్లు రెండు కోట్ల రూపాయలు ఎగవేసినట్లు- గుర్తించింది ఈడీ. ఈ స్కాంకు సంబంధించి ఏపీలో తీగ లాగితే డొంక కదిలినట్లు- తెలుస్తోంది. అధికారులతో బ్రోకర్లు కుమ్మక్కై పథకం నిధులను స్వాహా చేసినట్లు- ఆరోపణలు ఉన్న క్రమంలో ఈ కేసును సీరియస్ గా తీసుకుంది ఈడీ. గొర్రెలు కొనకుండానే కొన్నట్టు- రికార్డులు తయారుచేశారని.. కోట్లు- కొట్టేశారని ఆరోపిస్తోంది ఏసీబీ. ఈ స్కాం ద్వారా వేలకోట్లు- చేతులు మారాయని ఆరోపిస్తోంది ఏసీబీ. ఈ స్కాంకు సంబంధించి పశుసంవర్ధక శాఖకు చెందిన సీనియర్ అధికారులను అరెస్ట్ చేయగా.. అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ ఓఎస్డీపై కూడా కేసు నమోదయ్యింది. గొర్రెల పంపిణీ స్కీం లబ్ధిదారులు అసలు గొర్రెల వ్యాపారంతో సంబంధం లేనివారు ఉన్నట్లు- ఈడీ అధికారులు గుర్తించారు. అసలు గొర్రెల కొనుగోలు లేదా విక్రయం జరగలేదని.. కానీ వెయ్యి కోట్ల రూపాయలు మాయం చేసినట్లు- పేర్కొన్నారు. నకిలీ విక్రేతలు, ఫేక్ బిల్లులను మళ్లీ మళ్లీ పేర్కొంటూ డబ్బులు దోచుకున్నట్టు- ఆధారాలు గుర్తించారు. ఈడీ సోదాల్లో ప్రభుత్వ అధికారులకు, ఇతరులకు కిక్‌బ్యాక్ లకు సంబంధించిన డాక్యుమెంట్లు-, నకిలీ చెక్ బుక్‌లు, పాస్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

(మొదటి తరువాయి)

పేర్కొన్నారు. కొందరు మావోయిస్టులు చనిపోయి ఉండవచ్చని ఐజీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలోని పల్లి-బార్సూర్ రోడ్డు ప్రాంతంలో ప్రెజర్ ఐఈడీ పేలుడులో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. ఈ క్రమంలో తెల్లవారుజాము నుంచి భద్రతా బలగాలు మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. దంతేవాడ పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. మందుపాతరలను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ సమయంలో పేలుడు జరిగిందని పేర్కొన్నారు. ప్రెజర్ ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్లు గాయపడ్డారని.. ఇందులో ఒకరు ఇన్‌స్పెక్టర్ అని పేర్కొన్నారు. బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజబుల్ స్క్వాడ్ టీమ్ జవాన్ గాయపడ్డట్లు చెప్పారు. గాయపడిన ఇద్దరు దంతేవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని.. మెరుగైన వైద్య సంరక్షణ కోసం రాయ్‌పూర్‌కు హెలికాప్టర్ ద్వారా తరలించనున్నట్లు తెలిపారు. గాయపడిన సిబ్బంది సీఆర్పీఎఫ్ 195 బెటాలియన్‌కు చెందినవారని చెప్పారు.

# రష్యా సైన్యంలో చేరొద్దు.

(మొదటి తరువాయి)

ఆఫర్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న వారిని వెనక్కి పంపించాలని కోరుతూ మాస్కో అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. అంతేకాదు బాధిత కుటుంబ సభ్యులను సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు.

# యూరియా కృత్రిమ కొరతకు కాంగ్రెస్ కారణం

(మొదటి తరువాయి)

వెళ్లి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారు? దారి ఖర్చులు కూడా వచ్చినట్లు- లేదు. రాష్ట్రంలో పరిపాలనకు పక్షవాతం వచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు తప్ప.. అమలు చేయరు. యువత గురించి ప్రభుత్వం ఆలోచించాలని రామచందర్‌రావు కోరారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం

(మొదటి తరువాయి)

మోకాలి లోతు నీరు ప్రవహిస్తోంది. నగర శివారులోని హయత్‌నగర్ నుంచి సిటీ-వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. యాకుత్‌పురాలో ఓ చిన్నారికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆరేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడింది. బాలిక వెనుక వస్తున్న ఓ మహిళ ఇది గమనించారు. వెంటనే అప్రమత్తమై చిన్నారిని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. మరోవైపు మెదక్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మూడున్నరగంటల వ్యవధిలోనే 13 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాజీపల్లిలో 9.2 సెం.మీ, పాతూర్‌లో 8 సెం.మీ మేర వర్షం కురిసింది. మెదక్ పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు- ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మెదక్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీని వరద ముంచెత్తింది. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. మెదక్-హైదరాబాద్ హైవేపై భారీగా వరద నీరు చేరడంతో అధికారులు జేసీబీతో డివైడర్‌ను తొలగించారు.

# తెలంగాణ యువత నమ్మకాన్ని వమ్ము జేసిన కాంగ్రెస్ సర్కార్

(మొదటి తరువాయి)

ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేస్తున్నాను.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# నేడు రాధాకృష్ణన్ ప్రమాణం చేసే ఛాన్స్

(మొదటి తరువాయి)



రాగా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు- పోలయ్యాయి. ఇక బీఆర్ఎస్, బీజేడీ, ఎస్ఎల్‌డీలు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేసారు.

మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి సి.పి.రాధాకృష్ణన్ వైదొలిగారు. ఈమేరకు రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన నేపథ్యంలో.. గవర్నర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇకపోతే తాను రాజీపడని జాతీయవాదినని నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్ చెప్పారు. బుధవారం ముంబయిలోని రాజ్‌భవన్‌లో సత్కారం అందుకున్నారు. గవర్నర్‌గా ఇక్కడ కొనసాగిన 13 నెలలు.. ప్రజాజీవితంలో తనకెంతో సంతోషకరమైన సమయమని, ఆ మధుర స్మృతులను దిల్లీకి తీసుకువెళ్తున్నానని ఆయన చెప్పారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిదాయక గాథల్ని మా తల్లి చెబుతుండేది. విదేశీ దురాక్రమణదారులపై శివాజీ పోరాడినట్లే దేశంలో అణచివేతపై అంబేడ్కర్ పోరు సాగించారు. అలాంటి దార్శనికుల వల్లనే ప్రజాస్వామ్య దేశంగా భారత్ మనుగడ సాగిస్తోంది. ఇదిలావుంటే ఇండియా కూటమి తరపున పోటీచేసి ఓడిపోయిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి రాధాకృష్ణన్‌ను కలిసి అభినందించారు.

## 2025 సెప్టెంబర్ 12, శుక్రవారం




**మాసం - పక్షం**
భాద్రపద మాసం, కృష్ణ పక్షం
**తిథి**
కృష్ణ పక్షం పంచమి : సెప్టెంబర్ 11 మధ్యాహ్నం 12:45 నుండి సెప్టెంబర్ 12 ఉదయం 9:58 వరకు
శష్టి: సెప్టెంబర్ 12 ఉదయం 9:58 నుండి సెప్టెంబర్ 13 ఉదయం 7:23 వరకు
**నక్షత్రం**
భరణి: సెప్టెంబర్ 11 మధ్యాహ్నం 1:58 -సెప్టెంబర్ 12 మధ్యాహ్నం 11:58
కృతిక: సెప్టెంబర్ 12 మధ్యాహ్నం 11:58 - సెప్టెంబర్ 13 ఉదయం 10:11
**శుభ ముహూర్తాలు**
అమృతకాలము: ఉదయం 7:34 - 9:02 AM
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:48 - 12:36 PM
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:31 - 5:19 AM
**అశుభ సమయాలు**
రాహుకాలం: 10:41 AM - 12:12 PM
యమగండం: 3:14 PM - 4:46 PM
గులికా: 7:38 AM - 9:09 AM
వర్జ్యం: 11:05 PM - 12:33 AM

# నిరుపయోగంలో సూచిక బోర్డు

### ప్రయాణికుల ఆవేదన




**బోడుప్పల్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిలకానగర్ నుండి బోడుప్పల్ వైపు వచ్చే ప్రధాన రహదారిలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ స్వాగత బోర్డు కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రియ బార్ సమీపంలో కిందపడిపోయింది. అప్పటి నుంచి బోర్డు అలా పడిపోయినట్టే ఉంది. బోడుప్పల్‌కు కొత్తగా వచ్చే వాహనదారులు, ప్రయాణికులు సూచిక బోర్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గమ్యస్థానం తెలుసుకునేందుకు స్థానికులను అడగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది నగర పరిపాలనపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ అంశంపై తక్షణమే స్పందించి, సూచిక బోర్డును పునఃస్థాపించాలని ప్రజలు కోరుతున్నారు.

# అందెల శ్రీరాములకు మహా లడ్డూ ప్రసాదం అందచేసిన శ్రీ వెంకటేశ్వర డెవలపర్స్



**సరూర్‌నగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలో నాదర్గుల్ గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రుల సందర్భంగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం పాటలో మహా లడ్డూ ప్రసాదాన్ని శ్రీ వెంకటేశ్వర డెవలపర్స్ సంస్థ రూ.3,75,000కు దక్కించుకుంది. ఈ లడ్డూ ప్రసాదాన్ని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ అందెల శ్రీరాములు గారికి ఆయన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యంగా మాజీ బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీత, శ్రీకాంత్ గౌడ్, సహకార బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాప్ రెడ్డి, మహంకాళి అమ్మవారి ఆలయ చైర్మన్ ఏనుగు సంజీవ రెడ్డి, ఏనుగు రఘుమా రెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, తోట అరవింద్ రెడ్డి, తోట మహేష్ రెడ్డి, అనిల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బంగారి బాలకృష్ణ, అనిల్, గడ్డం రాఘవేందర్ రెడ్డి, సుమన్, కీసరి శ్రీకాంత్ రెడ్డి, వివేకానంద యూత్ అధ్యక్షులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలకపల్లిలో గాడితప్పిన రెవెన్యూ వ్యవస్థ

### లబ్ధిదారులపై నోరు పారేసిన గిర్దావర్



**తెలకపల్లి, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పత్రికల ద్వారా పలుమార్లు ఈ విషయాన్ని బహిర్గతం చేసినా, పరిస్థితులు మారకపోవడం పట్ల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం, ఎన్‌ఎఫ్బిఐ అప్లికేషన్‌లో గిర్దావర్ సంతకం కోసం వచ్చిన లబ్ధిదారుడు గంటల తరబడి ఎదురు చూసినా, గిర్దావర్ అందుబాటులో లేకపోవడం, ఫోన్ ద్వారా సంప్రదించగా "ఎక్కడికి రావాలో చెప్పు, వచ్చి సంతకం పెడతా" అంటూ నోరు పారేసిన ఘటన కలకలం రేపింది. ఇది అధికారుల తీరును బట్టబయలుచేస్తోంది. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసిల్దార్ జాకీర్ అలీకి పలుమార్లు విజ్ఞప్తి చేసినా, స్పందన లేకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తహసిల్దార్ కార్యాలయంలో సమయపాలన కనుమరుగవుతోందని, నిత్యం వచ్చే రైతులు, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు మార్చి, ప్రజలకు గౌరవం కల్పించే విధంగా కార్యాలయ నిర్వహణ సాగించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# వంగూరులో భారీ వర్షం

### లైబ్రరీ కాలనీలో ఇంట్లోకి ప్రవేశించన నీరు




**వంగూరు, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. వర్షపు నీరు ఎక్కడి రోడ్డులో అక్కడే నిలిచిపోయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లైబ్రరీ కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వర్షపు నీరు ఇంటి లోపలికి ప్రవేశించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు నీటిలో నడుచుకుంటూ బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికులు సంబంధిత అధికారులను సంప్రదించి తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, కాలనీలో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# రేషన్ కార్డులు, స్పింకర్ సెట్ల పంపిణీ



**వంగూరు, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల పరిధిలోని డిండి చింతపల్లి గ్రామంలో నూతన రేషన్ కార్డులు మరియు స్పింకర్ సెట్లను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గారి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆర్టికల్చర్ ఆఫీసర్ మహేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్, జిల్లా నాయకులు ఆల్వాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మండల నాయకులు జనర్దన్, గాఫూర్, శంకర్, శేఖర్, సైదులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# మంజీరా నీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే వివేకానంద్ కు వినతి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కుత్బుల్లాపూర్ డివిజన్ 131వ వార్డు పద్మా నగర్ ఫేజ్ -2 సంక్షేమ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలోని పలు వీధుల్లో మంజీరా నీటి సరఫరా సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మంజీరా పైప్‌లైన్ మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు, కాలనీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, రమణా రెడ్డి, కాలనీ వాసి శ్రీనివాస్, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై తెలకపల్లిలో అవగాహన

### - ఎస్సై బి.నరేష్ సూచనలు



**తెలకపల్లి, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల కేంద్రంలో స్థానిక ఎస్సై బి. నరేష్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను స్వీకరించవద్దని, ప్రభుత్వ వ్యవస్థల పేరుతో వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు అడిగినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా తెలియని ఫైల్స్‌ను డౌన్లోడ్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాల్లో నగదు మార్పిడి అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. విద్యాసంస్థల పేరుతో ఆన్లైన్ బదిలీ కోరినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకవేళ మోసపోయినట్లయితే వెంటనే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆటో-కారు ఢీ

### విద్యార్థులు, కూలీలకు తీవ్ర గాయాలు





**తెలకపల్లి, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలకపల్లి మండల పరిధిలోని గోలగుండం గ్రామ శివారులో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీలు, విద్యార్థులతో వెళుతున్న ప్యాసింజర్ ఆటోను ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతతో ఆటో పంట పొలాల్లోకి పల్టీ కొట్టింది. గాయపడిన వారిని స్థానికులు అప్రమత్తంగా స్పందించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. క్షతగాత్రుల పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు సమాచారం.

# పేదల కలల్ని సాకారం చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం

**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి శాశ్వత గృహం కల్పించడమే లక్ష్యమని కాంగ్రెస్ నాయకురాలు మనాలి ఠాకూర్ గారు తెలిపారు. రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రెండు మండలాలకు సాగునీరు తాగునీరు వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమయ్యాయని



పేర్కొన్నారు. ఇల్లు అనేది కేవలం గోడల సమాహారం కాదు, అది కుటుంబ భద్రతకు, భవిష్యత్తుకు పునాది అని అభిప్రాయపడ్డారు. పేదల కలల్ని నిజం చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారు మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని, పాలకుర్తి మండల ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి కొనసాగుతుందని తెలిపారు. లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, నేతలకూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, మండల పరిషత్, పోలీస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి మేళాకు ఎంపికైన మనోహరాబాద్ ఉపాధ్యాయురాలు వి. కవిత




**మనోహరాబాద్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మెదక్ జిల్లాలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి బోధనోపకరణాల (టీఎల్ఎం) మేళాలో మనోహరాబాద్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వి. కవిత రాష్ట్రస్థాయి మేళాకు ఎంపికయ్యారు. ఇంగ్లీష్ విషయ విభాగంలో ఆమె వినూత్న బోధన శైలికి గుర్తింపు లభించింది.వ్యతిరేక పదాలు, స్థితి సూచక పదాలు, విశేషణాలు, కథా విన్యాసం వంటి అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించడం ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. బోధనలో వినూత్నత, స్పష్టత, విద్యార్థుల అర్థవంతమైన భాగస్వామ్యం ఆమె ఎంపికకు కారణమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, సహ ఉపాధ్యాయులు ఆమెను. ఉపాధ్యాయుల ప్రతిభకు గుర్తింపు లభించడం పట్ల స్థానికంగా ఆనందం వ్యక్తమవుతోంది. విద్యారంగంలో నూతన మార్గాలను అన్వేషిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తున్న ఉపాధ్యాయురాలు వి. కవితకు రాష్ట్రస్థాయి మేళా ఎంపిక మరింత ప్రోత్సాహాన్ని కలిగించనుంది.

## టిడబ్ల్యూజేఎఫ్ కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి




**కల్వకుర్తి, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు ఈ నెల 26న మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల పరిధిలోని శుభం గార్డెన్ లో జరగనున్న బహిరంగ సభకు సంబంధించిన టీడబ్ల్యూజేఎఫ్ కరపత్రాన్ని గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ– "సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, అధికారులను మేల్కొలిపే శక్తిగా పాత్రికేయులు నిలుస్తున్నారు. వారి సేవలు అమూల్యమైనవి. జర్నలిస్టుల సంక్షేమానికి నా వంతుగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాను" అని పేర్కొన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, అమంగల్ బ్లాక్ సమన్వయ కమిటీ అధ్యక్షులు యూనుసు, ఉపాధ్యక్షులు కాడిగే చంద్రకుమార్, బ్లాక్ అధ్యక్షులు దరువుల శంకర్, గౌరవ అధ్యక్షులు రాచాలపల్లి నరసింహ, నాయకులు చప్పిడి తిరుపతి, పీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాటా గీత నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, వెంకటరెడ్డి, అంబేద్కర్ రిస్ట్ జి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా బిఆర్ఎస్ పార్టీ

**-యువ నాయకుని అంతిమయాత్రలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి..**





**కందుకూర్,సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు కీర్తిశేషులు దయ్యాల రాజు అకాల మరణ వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి లోనైనా సబితా ఇంద్రారెడ్డి భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా హుటాహుటిన కొత్తూరు గ్రామం చేరుకొని లిరాజు మృతదేహంపై పూలమాలవేసి సంతాపం తెలిపిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి వారి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ రాజు లేని లోటు ఎవ్వరు తీర్చలేనిదని చెప్పి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.. వారితో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వాసవి క్లబ్ ద్వారా మహిళకు ఉచిత కుట్టు మిషన్




**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాసవి శాతవాహన క్లబ్ ఆధ్వర్యంలో సంధ్యారాణి అనే మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేశారు. క్లబ్ అధ్యక్షులు ఎలగందుల మునీందర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ బండ సాగర్, కోశాధికారి తొడుపునూరి విశ్వనాథం, పైడ ప్రభాకర్, యాంసాని ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.స్వయం ఉపాధికి తోడ్పాటు అందించేలా మహిళకు మిషన్ అందజేయడం అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు.

# సుల్తాన్పూర్‌కు బస్సు రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



**సరూర్‌నగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని సుల్తాన్పూర్ మున్సిపాలిటీలో ఆర్టీసీ బస్సు సేవలు లేకుండా ఆరు సంవత్సరాలు గడిచినా, సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, మహిళలు, గర్భిణులు, విద్యార్థులు, రైతులు నిత్య ప్రయాణాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు.కాలేజీ సమయాల్లో విద్యార్థినీలు ఆకతాయిల అల్లర్లకు గురవుతున్నారని, పహాడ్ షరీఫ్, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, తుక్కుగూడ, కందుకూర్, కడ్తాల్, అమంగల్, కల్వకుర్తి వంటి ప్రాంతాలకు బస్సులు వెళ్తున్నా, సుల్తాన్పూర్‌ను విస్మరించడం అన్యాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అందెల శ్రీరాములు దృష్టికి తీసుకురావడంతో, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు కలిసి మీధాని డిపో ఎస్టీఐ గురుస్వామికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గట్టిగా హెచ్చరిస్తూ – "తక్షణమే బస్సు సేవలు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవు. ఆరు సంవత్సరాల నిర్లక్ష్యం ఇక మించదు" అని స్పష్టం చేశారు. డిపో అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరలో బస్సు సేవలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నవారు శ్రీనివాస్ రెడ్డి, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, కొంతం సంపత్ రెడ్డి, రావుల మల్లేష్, ఏను యాదిరెడ్డి, రామాచారి, కళ్లెం మురళీధర్ రెడ్డి, రవి, మలేష్, జి. నర్సింహా, కిరణ్ రాజ్, కే. జోగయ్య, దేవమ్మ, జయమ్మ, ఈరమ్మ, కృష్ణవేణి, యాదమ్మ, మంగమ్మ, నిర్మల, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ నూతన కమిటీలు

**తాలూకా స్థాయిలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు**



**కడ్తాల్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండలంలోని ఉమ్మడి మైసిగండి పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నూతన గ్రామ కమిటీలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో నియమించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి బంజారా నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఈ కమిటీల్లో మైసిగండి గ్రామపంచాయతీకి రామావత్ ప్రవీణ్ కుమార్ నాయక్, గానుమర్ల తండాకు జర్పుల కిషన్ నాయక్, పెద్దవేముల బాయి తండాకు కొర్ర శ్రీను నాయక్, గడ్డమీది తండాకు సభావత్ శ్రీను నాయక్ గ్రామ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వారితో పాటు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల నియామకాలు కూడా పూర్తయ్యాయి.ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ – "త్వరలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో కమిటీలను ఏర్పాటు చేసి, అనంతరం మండల స్థాయి కమిటీలు, తాలూకా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తాం. తాలూకా స్థాయిలో 20,000 మంది బంజారా సోదరులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాం. ఈ సభకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరవుతారు" అని తెలిపారు.అలాగే, "బంజారా బిడ్డలు ఎవరికైనా తక్కువ కారు. కొంతమంది చిన్నచూపు చూస్తున్నవారికి రాబోయే స్థానిక ఎన్నికల్లో బంజారాల సత్తా చూపిస్తాం. నన్ను అంచలంచలుగా ఎదుగుతున్న వ్యక్తిగా చూసి కొంతమంది దుష్ప్రచారం చేస్తూ అడ్డుకోవాలని చూస్తున్నారు. అలాంటి వారిని ప్రజలే ఓడగొడతారు. భవిష్యత్తు తరాలు బహుజన వాదానిదే. బంజారా సోదరులు ఏకతాటిపై వచ్చి పార్టీలకు అతీతంగా పనిచేయాలి. తాలూకాలో 35 శాతం బంజారా ఓటర్లు ఉన్నారు. మనం కలిసికట్టుగా ఉంటే ఎమ్మెల్యేలు కూడా మనమే అవుతాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు తులసి రామ్ నాయక్, శ్వేతా భూనాథ్, డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ శారద పాండు, రమణ నాయక్, శ్రీను, లక్ష్మణ్ నాయక్, సోమ్లా నాయక్, భీమ నాయక్, మోతిలాల్, రాజు, రాజశేఖర్, జగన్, తేజు, హరి, నాగేష్, బన్సీలాల్, రమేష్, గణేష్, సరియా, రవి, దత్తు, మల్లేష్, శ్రీకాంత్, రాజేష్, నరేష్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంచాలి

**రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి**




**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంచడమే కాక, సాంప్రదాయ పంటలను కాపాడుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి సూచించారు. బత్తాయి రైతుల సమస్యలపై కమిషన్ కార్యాలయంలో ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులు, హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నల్గొండ జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో సాగు జరిగిన బత్తాయి పంట ప్రస్తుతం 43 వేల ఎకరాలకు పరిమితమైందని ఆయన తెలిపారు. సరైన మొక్కలు అందక, మార్కెటింగ్ లోపాలతో రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ నర్సరీలపై ఆధారపడకుండా, ఉద్యానవన శాఖ నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు అందించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు సక్రమంగా పనిచేయాలని, ప్రైవేట్ మార్కెట్లపై చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. బత్తాయి రైతుల బలోపేతం కోసం ఉద్యానవన, మార్కెటింగ్ శాఖలు సమన్వయంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కెవిఎన్ రెడ్డి, భూమి సునీల్, గోపాల్ రెడ్డి, రాములు నాయక్, భవాని రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, జాయింట్ డైరెక్టర్లు పద్మహార్షిణి, బాబు, డీఎస్‌హెచ్‌ఓ సుభాషిణి, శాస్త్రవేత్తలు రాజా గౌడ్, హరి వెంకట ప్రసాద్, మహేష్ నాయక్, శ్రావ్య, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల మహాసభలో సిఐటియు గళం



**కందుకూర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కందుకూర్ మండల కేంద్రంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల మహాసభలో సిఐటియు మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్ మాట్లాడుతూ – "కార్మికులు అప్పులు తెచ్చి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నా, బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేతనాలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. రాగి జావా కోసం ఒక్క విద్యార్థికి రూ.25 ఖర్చు చెబుతూ, ఒక్క రూపాయి మాత్రమే ఇవ్వడం అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15లోపు బిల్లులు చెల్లించకపోతే 16, 17 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని మహాసభ తీర్మానించింది .ఈ సందర్భంగా కే ప్రభావతి అధ్యక్షురాలిగా, కే శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా, జి. అశ్విని ఉపాధ్యక్షురాలిగా, బాలమని కోశాధికారిగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎంఈఓను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

## అరణ్య వీరుని జ్ఞాపకాలు

**-ప్రజల మదిలో నరహరి**



**ఎలిగేడు, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అటవీ సంపదను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన చలందుల నరహరి 28 ఏళ్లైనా ప్రజల మదిలో నిలిచి ఉన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న సమయంలో దుండగుల చేతిలో ఆయన మరణించారు. ఉద్యోగానికి ముందు జవహర్ యూత్ క్లబ్ స్థాపించి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు మార్గదర్శకుడిగా నిలిచారు. జాతీయ అరణ్య వీరుల దినోత్సవం సందర్భంగా ఆయన మిత్రులు, స్థానికులు జ్ఞాపకాలను తలచుతూ ఘనంగా నివాళు లర్పించారు.

# విద్యార్థి దశ నుంచే వ్యవసాయం పై అవగాహన పెంచుకోవాలి













**జాతీయ యువజన అవార్డు గ్రహీత శివ కుమార్.**
**- గ్రీన్ ఇండియా ప్రాజెక్ట్ లో భాగంగా బడి నుండి ప్రకృతి వడికి కార్యక్రమం విజయవంతం**

**శంషాబాద్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
స్వామివివేకానంద సేవా బృందం,మై భారత్, పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు-అమ్మ సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు వ్యవసాయ శిక్షణ కార్యక్రమం శంషాబాద్ మండల గండిగూడ వద్ద ఉన్న బాటీ అగ్రి ఫార్మ్ లో నిర్వహించడం జరిగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమంలో ఆమన్ గల్ పట్టణానికి చెందిన వివేక విద్య భారతి హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత శివ కుమార్ మాట్లాడారు యువత పాఠశాల స్థాయి నుంచే వ్యవసాయం పై అవగాహన పెంచుకోవాలి అని వ్యవసాయం వైపు అడుగులు వెయ్యాలని స్వయం ఉపాధి కొరకు వ్యవసాయ రంగంలో అనేక అవకాశలు ఉన్నాయి అని తెలిపారు. అనంతరం భాటి అగ్రి ఫార్మ్ నివాహకులు రాజశేఖర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం లో పండించే పంటలకు మార్కెట్ లో మంచి లాభాలు ఉన్నాయి అని సోలార్ డ్రాయేర్ వ్యవసాయం, వర్మీ కంపోస్ట్ నిర్వహణ , జెరేనియం సాగు, మిశ్రమ పంటల సాగు ద్వారా ద్వారా మంచి ఉపాధి పొందోచ్చు అని కేంద్ర ప్రభుత్వం కూడా యువతకు వ్యవసాయంలో మంచి అవకాశలు ఇస్తుంది అని కోరారు.అనంతరం శిక్షణ లో పాల్గొన్న విద్యార్థులకి సర్టిఫికెట్ లు అందజేశారు.కార్యక్రమంలో వ్యవసాయ నిపుణులు బంకట్ లాల్, రాజశేఖర్,ఉపాధ్యాయులు శ్రీనివాస్,పర్యావరణ పరిరక్షణ సమితి చెట్టు అమ్మ సభ్యులు కండె వెంకట్, సామల సాయి, బొజ్జ నిఖిల్, బాగే శ్రీకాంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ కి సన్మానం



**దేవరకొండ,సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ ఎర్ర ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముదిగొండ గ్రామం జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ ఉత్తమ హెచ్ఎంగా మాతృ నాయక్ ఎంపిక అయ్యారు. తెలంగాణ రాష్ట్రం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదగా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా అవార్డు అందుకున్న సందర్భంగా ఎంఈఓ మాతృనాయక్ ని శాలువతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ ఎర్ర ఆంజనేయులు మాట్లాడుతూ మాతృనాయక్ భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ అవార్డులు అందుకోవాలని వారి ఆయురారోగ్యాలు బాగుండాలని విద్యార్థిని విద్యార్థులకు తనదైన శైలిలో మంచి మార్గంలో నడవాలని క్రీడారంగంలో ప్రోత్సాహం ఇస్తూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిండి (గుండ్లపల్లి) మండలం అధ్యక్షులు పేరుమల్ల అనిల్ కుమార్, ప్రైమరీ హెచ్ఎం ఎం రాం భాయ్ , ఎంఈఓ ఆఫీస్ కంప్యూటర్ఆపరేటర్ శ్రీనివాస్,అటెండర్ లచ్చ, అంబేద్కర్ యువజన సంఘం గోనబోయినపల్లి గ్రామ కమిటీ సభ్యులు మద్దెల ఆశీర్వాదం పాలే దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం మోడల్ స్కూల్‌లో అవకతవకలు

**ఎస్ఎఫ్ఐ ఆందోళన**




**మహేశ్వరం, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం మోడల్ స్కూల్‌లో జరుగుతున్న అవకతవకలపై ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే.వై. ప్రణయ్ ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ గోపి సమయాన్ని పాటించకుండా ఇష్టానుసారంగా రావడం, వెళ్లడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు.అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద స్కావెంజర్ల జీతాల నిధుల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. 825 మంది విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నెలకు రూ.20 వేల చొప్పున నిధులు విడుదలవుతున్నా, ఇద్దరు స్కావెంజర్లకు రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సిన చోట రూ.7 వేల చొప్పున మాత్రమే చెల్లిస్తూ రూ.6 వేలు పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్ధు, తరుణ్, రాహుల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల పరిపాలనపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.

## సెప్టెంబర్ 13న కుక్కల దత్తత కార్యక్రమం

**కలెక్టర్ నారాయణ అమిత్**



**నల్లగొండ, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వీధి కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అవగాహన, వ్యాక్సినేషన్, దయా భావం పెంపొందించేందుకు నల్లగొండ జిల్లాలో సెప్టెంబర్ 13న కుక్కల దత్తత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు.కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ "వీధి కుక్కలపై శాస్త్రీయంగా స్పందించేందుకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలు చేపట్టుతున్నాం. కుక్కల పట్ల ప్రేమ చూపే వారికి దత్తత కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించనున్నాం" అని వివరించారు.ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రామ్‌నగర్ మున్సిపల్ పార్కులో ప్రారంభించనున్నారని తెలిపారు.

## కరీంనగర్ టవర్ సర్కిల్‌లో ఘనంగా నవరాత్రి శంకుస్థాపన



**కరీంనగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
టవర్ సర్కిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 21 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న దుర్గానవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నేడు నవరాత్రి మంటప నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తి, భద్రత, భవ్యతతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్‌కు పోలీస్ కమిషనర్ సన్మానం



**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కనకం రాజేందర్ (40) తన నిజాయితీతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. వేములవాడ నుంచి కరీంనగర్‌కు వచ్చిన ఓ మహిళ గీతాభవన్ వద్ద ఆటో దిగిన సమయంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయింది. బ్యాగ్‌ను గమనించిన రాజేందర్ వెంటనే తిరిగి వెళ్లి ఆమెకు అప్పగించారు. ఆబాధిత మహిళ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆభరణాలను తాకట్టు పెట్టేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై స్పందించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ గురువారం కమిషనర్ కార్యాలయంలో రాజేందర్‌ను శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మద్దెల రాజేందర్, పడాల రాజమౌళి, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. నిజాయితీకి చిరునామాగా నిలిచిన రాజేందర్‌ను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

# గర్భిణీ స్త్రీల వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దు

-జిల్లా కలెక్టర్: ఇలా త్రిపాఠి



**నల్లగొండ, సెప్టెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గురువారం ఆమె నల్గొండ మండలం, రాములబండ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హై రిస్క్ ఏఎన్ సి కేసులు, కుక్క కాటుకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్, ఈడిడీ క్యాలెండర్ ,ఆసుపత్రిలో మందుల అందుబాటు, మలేరియా,డెంగ్యూ పరీక్షల నిర్వహణ తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ జమీర్ తో మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం వారికి వైద్య సేవలు అందించాలని చెప్పారు.ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రికి వస్తున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పి హెచ్ సి లో అందుబాటులో ఉన్న మందులు , ఆంటీ రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి ఆవరణ లో పరిశుభ్రతను పరిశీలిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అప్పజిపేటలో ఉన్న చందుపట్ల మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు.

# రేపే సోషల్ వెల్ఫేర్ మినిస్టీరియల్ సిబ్బంది కార్యవర్గ సమావేశం...

-విజయవంతం చేయండి
- ఉప్పు సత్యనారాయణ విజ్ఞప్తి...



**కొత్తపేట్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్**
: తెలంగాణ ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం కొత్తపేట్ లోని బిజెఆర్ భవన్ లో 13వ తేదీ రెండో శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నదని అసోసియేషన్ ప్రతినిధి ఉప్పు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాకారం జరిగిన తర్వాత ఎన్నో సమావేశాలు విజయవంతంగా జరిగినప్పటికీ, బిజేఆర్ భవన్ లో రేపు జరగనున్న మినిస్టీరియల్ స్టాఫ్ కార్యవర్గ సమావేశానికి ఎంతో ప్రత్యేకత ఉన్నదని ఆయన వివరించారు. ఎన్నో ఏళ్లుగా మినిస్టీరియల్ స్టాప్ సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని, పరిష్కారం కోసమే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారని ఉప్పు సత్యనారాయణ వివరించారు. ఈ సమావేశంలో కార్యవర్గ సమావేశం సందర్భంగా అన్ని జిల్లాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలియజేస్తారని దీంతో ఉదయం సెషన్ ముగుస్తుందని ఆయన వివరించారు. భోజన విరామం అనంతరం మొదలు కానున్న సమావేశంలో ఎన్నికల ప్రక్రియ ఉంటుందని, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. టీఎన్జీవో సీనియర్ నేతలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారని ఉప్పు సత్యనారాయణ తెలిపారు. ఇదిలా ఉండగా 13వ తేదీన బిజెఆర్ భవన్ లో జరగనున్న సమావేశ హాల్ ఏర్పాట్లను గురువారం తెలంగాణ ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ మినిస్టీరియల్ అసోసియేషన్ నేతలు పర్యవేక్షించారు. పర్యవేక్షించిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు జంపాల సజన్ కుమార్, శంకరయ్య, శ్రీనివాస్ వెక్కిరాల, దప్పు గోపాల్, అస్లాం తదితరులు ఉన్నారు.



# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ చైతన్య స్కూల్ సీజ్




**కొత్తకోట,సెప్టెంబర్ 11( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొత్తకోట మదనాపురం రోడ్డులో నడుస్తున్న శ్రీ చైతన్య స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడుతోందని గుర్తించి, పాఠశాల గుర్తింపును రద్దు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు సెప్టెంబర్ 10న విద్యాశాఖ అధికారులు పాఠశాలను సీజ్ చేయడానికి వెళ్లగా, ప్రిన్సిపాల్, బిల్డింగ్ యజమానులు, కొంతమంది స్థానిక నాయకులు అడ్డంకులు సృష్టించారు. దీంతో కొత్తకోట ఎస్సైకి సమాచారం ఇవ్వగా, పోలీసులు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 11న పోలీసుల సహకారంతో పాఠశాలను అధికారికంగా సీజ్ చేశారు.

# వార్డు వార్డుకి సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ మంజూరు

-అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం.
-దేవరకొండ పట్టణంలో పండగలా సాగిన "జనహిత మార్నింగ్ వాక్" కార్యక్రమం.
ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్.





**దేవరకొండ,సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ పట్టణ కేంద్రంలోని 5వ వార్డులో "జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ విత్ పీపు " కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ వివిధ కాలనీలో, ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటించి,పట్టణ ప్రజలకు నేరుగా కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని అక్కడిక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజా సమస్యలు తెలుసుకోవడం, తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా జనహిత ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించడం, ప్రజాక్షేత్రంలోకి అధికారులు తీసుకువెళ్లడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకుంటూ, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సాగిన జనహిత యాత్ర.

దేవరకొండ పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలనే ధృడ సంకల్పంతో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో అన్ని వార్డులలో నూతనంగా సీసీ రోడ్ల, అండర్ డ్రైనేజీలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రతి వార్డులో అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రధాన రహదారులను విస్తరణ పరచడం జరుగుతున్నదని అన్నారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని, ఇండ్లు మంజూరు కానీ నిరుపేదలు ఎవరు ఆందోళన చెంద వద్దని తెలిపారు. ప్రతి మహిళ మహిళా సంఘాల గ్రూపులో చేరి వడ్డీ లేని రుణాలను పొందడమే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు పొంది పలు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. ఎక్కడ అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని, ప్రతి వార్డులలో రోడ్లు వేయడం,రోడ్లు విస్తరణ పనులు చేపట్టడం ముఖ్యమంత్రి ఆదేశాలతో జరుగుతున్నాయని తెలిపారు. 1.00కోటి రూపాయల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో ఎల్ఐసి ఆఫీస్ నుండి దేవి టాకీస్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ?2.00కోట్లు రూపాయల కోర్టు నుండి పేట చెరువు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, చేశారు.?1.04 లక్షల రూపాయల , 2.0నిధులతో తుల్చమ్మ కుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు,వివిధ హోదాల్లో ఉన్న నాయకులు,మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, పట్టణ మాజీ కౌన్సిలర్లు,అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేసిన

జోగులాంబ జోన్ -7 డిఐజి -ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్.






**వనపర్తి, సెప్టెంబర్ 11 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా జోగులాంబ జోన్-7 డిఐజి ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ స్వాగతం పలికారు. డిఐజి వివిధ విభాగాల రికార్డులను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. ఫిర్యాదు దారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై పటిష్ట చర్యలు చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.అలాగే జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవడాన్ని ప్రోత్సహించాలని, పోలీస్ రికార్డుల్లో 5S విధానం అమలు చేయాలని డిఐజి పేర్కొన్నారు. జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్పీ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడు అరెస్ట్




**దేవరకొండ,సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేవరకొండ పట్టణంలో హనుమాన్ నగర్ లోని రాపోతు రమేష్ ఇంటిలో తేదీ 22. 4. 2025న పట్టపగలు ఇంట్టి తాళం పగలగొట్టి ఇంట్లో గల సుమారు 2.2 తులాల బంగారు ఆభరణాలు నగదు రూపాయలు ఆరు లక్షలు దొంగతనం జరిగిన సంఘటనపై రాపోతు రమేష్ తండ్రి బుచ్చయ్య పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు పోలీస్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనైనది. ఇట్టికేసు విషయంలో దేవరకొండ ఏఎస్పి మౌనిక ఆధ్వర్యంలో దేవరకొండ ఇన్స్పెక్టర్ మరియు పరిశోధనాధికారి పి వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో, దేవరకొండ ఎస్సై నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఒక బృందంగా ఏర్పడి దొంగతనంచేసిన నిందితులను చాకచక్యంగా పట్టుకోవడం జరిగినది. ఇట్టి నిందితుల్లో మొదటి నిందితుడైన ఫీట్ల గంగాధర్ తండ్రి చంద్రశేఖర్ వయసు 30 సంవత్సరాలు కులం వడ్డెర వృత్తి కూలి పని, కమ్మని చెట్ల వీధి, కళ్యాణదుర్గం పట్టణం, అనంతపురం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్,2011వ సంవత్సరం నుండి తాళం వేసిన ఇండ్లలో దొంగతనం చేయడంలో సిద్ధహస్తుడు ఇతను, ఇతనిపై 100పై దొంగతనం కేసులు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ కర్ణాటకలో నమోదు చేశారు. దేవరకొండ పట్టణంలో చేసిన దొంగతనం సొమ్మును ఖిల్లా పార్కులో దాచి పెట్టాడు, ఈ సొమ్మును తీసుకుపోవడానికి దేవరకొండకు రాగా పోలీసులు అనుమానించి అతని పట్టుకొని రెండు లక్షల 50 వేల నగదు డబ్బులు సీజ్ చేశారు. కేసు విషయాలు ఛేదించిన పోలీసు వివరాలు పి వెంకటరెడ్డి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, నారాయణ రెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ , ఎం మౌనిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కే సతీష్, బి అంజయ్య, వి సింహాద్రి, ఎస్.కె చాంద్ పాషా రైటర్,ఇట్టి కేసు నుచేదించిన పోలీసు వారిని అధికారులు తగిన శాఖా పరమైన రివార్డులు ప్రతిపాదించి అభినందన చెప్పడం జరుగుతుందని తెలిపారు.

# గ్రూప్-1 పరీక్ష అవకతవకలపై బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆందోళన




**కరీంనగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శాతవాహన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. నిరుద్యోగ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ శాంతియుత నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ "ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే, ప్రశ్నించే వారిని అరెస్టు చేయకుండా, పరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. జీవో నెం.29 రద్దు చేసి, జీవో నెం.55ను అమలు చేయాలి. గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి, తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, "హైకోర్టు సూచించినట్లుగా సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ జరపాలి. పరీక్షల్లో అవకతవకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీజీపీఎస్సీ చైర్మన్, కమిషన్ సభ్యులు నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి. లేకుంటే ప్రభుత్వంపై ఉద్యమం తప్పదని, గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పోరాటం కొనసాగుతుందని" హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ శాతవాహన విశ్వవిద్యాలయం ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షులు బొంకూరి మోహన్, కరీంనగర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు గంగాధర చందు, రాష్ట్ర నాయకులు బందారపు అజయ్ కుమార్ గౌడ్, ఆరే రవి గౌడ్, నారదాసు వసంత రావు, పటేల్ శ్రవణ్ రెడ్డి, సోమిరెడ్డి నరేష్ రెడ్డి, ఒడ్నాల రాజు, అఫ్రోజ్, అవినాష్, సోహెల్, సైఫ్, ప్రశాంత్, పదం సిద్ధు, లింగాల సాయి కిరణ్, ఉప్పు మనోజ్, శ్యామ్, అక్షయ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్




**కరీంనగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్‌లో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, బీపీఆర్అండ్‌డి డీజీ ఆలోక్ రంజన్, అదనపు డీజీ రవి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ – "జైలు పరిపాలన కేవలం భద్రతకే కాక, ఖైదీల సంస్కరణ, పునరావాసానికి సాధనంగా ఉండాలి. ఖైదీ జీవితంలో మార్పు తీసుకురావడమే అసలైన విజయంగా పరిగణించాలి" అని పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో 22 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా, తెలంగాణ రాష్ట్రం 17 ట్రోఫీలు గెలుచుకొని అత్యుత్తమ ప్రదర్శన చేసింది. బాస్కెట్‌బాల్, కబడ్డీ, లలిత కళలు, ఆరోగ్య సంరక్షణ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రస్తుతం దేశంలో 1330 జైళ్లు, 5.73 లక్షల ఖైదీలు ఉన్నారని, జైలు పరిపాలనను మానవీయంగా తీర్చిదిద్దే దిశగా ఈ మీట్ వేదికగా నిలిచిందని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు.

# హుస్నాబాద్ అభివృద్ధికి శంకుస్థాపనల మేళం



**హుస్నాబాద్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. బంజేరుపల్లి నుండి పందిళ్ళ వయా గొల్లపల్లి వరకు రూ.2.47 కోట్లతో, పొట్లపల్లి నుండి పరివేద వరకు రూ.2.07 కోట్లతో పిఆర్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. హుస్నాబాద్ పట్టణంలో పల్లె చెరువు అభివృద్ధికి రూ.2 కోట్లు, శ్రీ చైతన్య స్కూల్ నుండి పెట్రోల్ పంపు వరకు సెంట్రల్ మీడియం అవెన్యూ ప్లాంటేషన్, సుందరీకరణ, స్వాగత తోరణాల నిర్మాణానికి రూ.3 కోట్లతో శంకుస్థాపన చేశారు. 1930 నాటి ఆల్బియన్ బస్సు బస్ స్టేషన్ ఆవరణలో ప్రారంభించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆధ్వర్యంలో 1932 నాటి బస్ మోడల్ను జంక్షన్ అభివృద్ధి భాగంగా ప్రారంభించారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్, గౌరవెల్లి ప్రాజెక్టు, ఇండస్ట్రియల్ పార్కు, మహాసముద్రం గండి టూరిజం, ఎల్లమ్మ గుడి, పొట్లపల్లి శివాలయం వంటి ప్రాజెక్టులతో హుస్నాబాద్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాణసంచా దుకాణాల దరఖాస్తులకు సెప్టెంబర్ 24 చివరి తేదీ

**కరీంనగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



దీపావళి పండుగను పురస్కరించుకొని తాత్కాలిక బాణసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సెప్టెంబర్ 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ తెలిపారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, రూ.600 చలాన్, ఐదు సెట్స్ జిరాక్స్ కాపీలు సమర్పించాలి. నిరభ్యంతర పత్రాలు పొందిన తర్వాతే అనుమతులు మంజూరవుతాయని తెలిపారు. 24వ తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు తిరస్కరించబడతాయని స్పష్టం చేశారు. నిర్దేశిత ప్రాంతాలకు బాహిరంగా బాణసంచా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కౌతాళం మండలంలో కుండపోత వర్షాలకు రైతన్నలు అల్లాడిపోతున్నారు.

**కౌతాళం , సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కౌతాళం మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి ఎరిగేరి తోవి బదినేహాల్ కుంటన హాల్ ఉప్పరహాల్ రౌడూరు బాపురం లింగాలదిన్నె అగసలదీన్ని వీర్లదిన్నె దోమలదిన్నె కాత్రికి మేళిగనూరు నది చాగి కుంభలనూరు రెండు క్యాంపులు మరళి హాల్వి గోతలదొడ్డి గుడుకంబాల్లి వల్లూరు పొదలకుంట మదిరి సులేకేరి బంటకుంట చూడి ఉరుకుంద చిరుతపల్లి మల్లన్న హట్టి తిప్పలదొడ్డి కరణి ఉరుకుంద కామవరం తదితర ప్రాంతాల్లో వర్షం దాటికి జనాలు రైతులు ఇళ్లకే పరిమితమయ్యారు. మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ వర్షాల వల్ల పంటలు పూర్తిగా నష్టపోయాయి.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చారిత్రాత్మక నిర్ణయం

**కరీంనగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 185 (11-09-2025) ద్వారా సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (రాష్ట్ర స్థాయి) పునఃసంస్థాపన చేయడం చారిత్రాత్మక నిర్ణయమని కరీంనగర్ జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కౌన్సిల్ ద్వారా ఉద్యోగులు-అధికారుల మధ్య నేరుగా చర్చలు జరగడం ద్వారా ఉద్యోగుల సమస్యలు, క్రమశిక్షణ చర్యలు, విధి విధానాలు, పని ఒత్తిడి, జాబ్ చార్ట్ వంటి అంశాలు ప్రభుత్వ దృష్టికి సమగ్రంగా చేరతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా సేవలందిస్తూ అన్ని విభాగాల్లో ప్రజా సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తుచేశారు. ఇంతకాలంగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడం వల్ల ఉద్యోగుల సమస్యలు



ప్రభుత్వానికి నేరుగా చేరలేదని, ఈ నేపథ్యంలో ఉద్యోగ అనుకూల నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీవోల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయాన్ని సాధించడంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస్, ముజీబ్ గార్ల కృషి ప్రశంసనీయమని అభినందించారు. 2014లో రద్దయిన ఉద్యోగ సంఘాల గుర్తింపును పునరుద్ధరించడం హర్షణీయమని, భవిష్యత్తులో కూడా ప్రభుత్వం ఉద్యోగులను కన్నబిడ్డలుగా, కంటికి రెప్పలా కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నాయకులు మడిపల్లి కాళీ చరణ్, డాక్టర్ అరవింద్ రెడ్డి, సంఘము లక్ష్మణరావు, నాలుగో తరగతి కోటా రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, సర్దార్ హరేమేందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, ఒంటెల రవీందర్ రెడ్డి, ఒంటెల ప్రసాద్ రెడ్డి, గంగవరం రమేష్, రాజేష్, భరద్వాజ్, సుమంత్ రావు, వాస్తవిక్ శ్రీమాన్, శారద, సబిత, సునీత, సరిత, కామ సతీష్, గిరిధర్ రావు, సందీప్ తదితరులు ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షంగా స్వాగతించారు.


# పల్లెల్లో రోడ్లు - భద్రతకు కెమెరాలు



**గణపురం, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు, వ్యవసాయ రవాణా, విద్యార్థుల ప్రయాణం సులభతరం చేయడం లక్ష్యంగా పల్లెల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఆయన భూపాలపల్లి, గణపురం మండలాల్లో రూ.390 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కమలాపూర్, కొత్తపల్లి, గొర్లవీడు, రంగారావుపల్లి, బంగ్లాపల్లి, సీతారాంపూర్, గణపురం తదితర గ్రామాల్లో రోడ్లకు నిధులు కేటాయించారు. అభివృద్ధి పట్టణాలకు మాత్రమే కాక, పల్లెల్లో కూడా సమానంగా ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం అందే వరకు కృషి చేస్తానని తెలిపారు. అదే రోజు గొర్లవీడు గ్రామంలో రూ.2.5 లక్షల వ్యయంతో 20 సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, నేరాల నియంత్రణలో కెమెరాలు కీలకమని పేర్కొన్నారు. శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామస్థుల సహకారంతో కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇతర గ్రామాలు కూడా ఇదే బాటలో ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో రైతుల సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, ఇటీవల వడగళ్ల వర్షానికి ధాన్యం నష్టపోయిన రైతులకు నష్టపరిహార చెక్కులు పంపిణీ చేశారు. చుంచు మల్లయ్యకు 14,710, సారయ్యకు 19,635, రాములకు 6,705 రూపాయల చెక్కులు అందజేశారు. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారి నష్టపరిహారం అందించిన ఘనతగా నిలిచింది.రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, ప్రతి గ్రామంలో రెండో, మూడో సారిగా యూరియా అందించామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వడ్ల కటింగ్ పేరుతో రైతులను ఇబ్బందిపెట్టారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గింజ కటింగ్ లేకుండా వడ్లు కొనుగోలు చేసి, 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని పేర్కొన్నారు.రైతుల కోసం అదనంగా 1400 మెట్రిక్ టన్నుల యూరియాను నిల్వ ఉంచినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ ఖాతాలో ఉన్న 3 కోట్ల నిధులను రైతుల అభివృద్ధికి వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లరెడ్డి, డీఎల్ఎం ప్రవీణ్, కమిటీ డైరెక్టర్లు, అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# అంతర్గత రోడ్ల అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ పశ్చిమ, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 10వ డివిజన్ కాపువాడ, 11వ డివిజన్ పరిధిలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ – "ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యతతో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నాం. శంకుస్థాపన చేసిన ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించాం" అని తెలిపారు.కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, దేవరకొండ విజయ సురేందర్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, సంగీత్, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రాంతీయ నాయకులు పాల్గొన్నారు.ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఉదయాన్నే కాలనీలో కిచ్చెన్న ప్రత్యక్షం

## ప్రజలతో టీ చర్చలు



**బాలాపూర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఈ ఉదయం ఆర్కేపురం డివిజన్‌లోని మార్గదర్శి, టెలిఫోన్ కాలనీల్లో పర్యటించారు. వాకింగ్ చేస్తున్న వృద్ధులతో నమస్కారంతో పలకరించి, కాలనీ సమస్యలపై 'ఛాయ్ పే చర్చ' నిర్వహించారు. టీ, బిస్కెట్‌తో చర్చలు సాగించగా, స్థానికులు తమ సమస్యలను వివరించారు.కేఎల్ఆర్ ట్రస్టు ద్వారా కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సేవలను గుర్తు చేస్తూ, "సేవకుడే నాయకుడు" అంటూ సీనియర్ సిటిజన్లు ప్రశంసలు కురిపించారు. రైతుబజార్లు, విద్యావాలంటీర్లకు తెరతీసిన సేవలను గుర్తుచేశారు. రిస్కూలను పరిష్కరించేందుకు హామీ ఇచ్చిన లక్ష్మారెడ్డి గారి పర్యటనతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.చిరు సన్మానం అందజేసిన సీనియర్లు, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, సత్కారంతో హర్షం వ్యక్తం చేశారు.

# అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

**ఎమ్మిగనూరు సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మరియు మూడు మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వానాకాలం సీజన్‌లో పట్టణంలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించడంతో పాటు పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని హెల్త్ కేర్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణ మరియు వ్యాధుల నియంత్రణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

## 'మెటా ఫండ్' మోసం కేసులో నలుగురు అరెస్ట్




**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లాలో 'మెటా ఫండ్' పేరుతో నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీ ద్వారా ప్రజలను మోసగించిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు రెట్లు లాభం వస్తుందన్న వాదనతో డబ్బులు పెట్టించాలని ప్రజలను నమ్మబలికిన హైదరాబాద్‌కు చెందిన వరాల లోకేశ్వర్ రావు ప్రధాన సూత్రధారి కాగా, అతడితో కలిసి కరీంనగర్‌కు చెందిన బూర శ్రీధర్, తులసి ప్రకాష్, దాసరి రమేష్, దాసరి రాజు ఈ మోసంలో భాగస్వాములయ్యారు. వీరు కలిసి ఎనిమిది మంది బాధితుల నుంచి రూ. 54.65 లక్షలు వసూలు చేసి, శ్రీ రామ టింబర్ డిపోలో నకిలీ ఐడీలతో మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన అనంతరం నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. ప్రధాన నిందితుడు వరాల లోకేశ్వర్ రావు పరారీలో ఉండగా, అతన్ని త్వరలో పట్టుకొని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ తెలిపింది. ఇటువంటి 'మూడు రెట్లు లాభం' వాగ్దానాలు, నకిలీ ట్రేడింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనరేట్ విజ్ఞప్తి చేసింది. ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఆర్. ప్రకాష్, ఎస్సైలు తోట తిరుపతి, నేరేళ్ల రమేష్, హెడ్ కానిస్టేబుల్ హసన్, కానిస్టేబుల్ అనిల్, ఖలీఫా కీలక పాత్ర పోషించగా, వారిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## మంథనిలో విద్యా అభివృద్ధికి శ్రీధర్ బాబు కృషి



**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మంథని మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎంపీపీఎస్ బాలికల పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులను ప్రారంభించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించడంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని పేర్కొన్నారు. మంచు లక్ష్మి నేతృత్వంలోని టీచ్ ఫర్ చేంజ్ సంస్థ మంథనిలో ఆరు తరగతులను డిజిటలైజ్ చేయగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 51 తరగతులకు డిజిటల్ సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. విద్యతో విజ్ఞానం, విజ్ఞానంతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి 205 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ప్రతి సోమవారం నిర్మాణ పురోగతిని బట్టి నిధులు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మంచు లక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బావుపేటలో వ్యర్థాలపై అవగాహన కల్పించిన పారమిత విద్యార్థులు




**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మండలం బావుపేట గ్రామంలో పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సహాయక క్షేత్రాధికారి శ్రీనాథ్, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. కాలుష్య నివారణ, వాతావరణ మార్పుల తగ్గింపు, ప్రజారోగ్యం పరిరక్షణకు వ్యర్థాల వర్గీకరణ, తగ్గింపు, పునర్వినియోగం, రీసైక్లింగ్, కుళ్ళిపోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ-వ్యర్థాలు, తడి, పొడి, బయోమెడికల్, నిర్మాణ, రసాయన వ్యర్థాల గుర్తింపు, పారవేసే విధానాలపై దృష్టి సారించారు. శ్రీ లలిత్ మోహన్ సాహు మార్గదర్శకత్వంలో 9వ తరగతి విద్యార్థులు జి. అదితి, ఎస్. సాన్విక, మీహా ముబారక్, వి. అమోగ్ సాయి, ఎస్. జయకృష్ణ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు, డైరెక్టర్ హనుమంతరావు, ప్రిన్సిపాల్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రవీంద్ర పాత్రో, భవాని విద్యార్థుల చొరవను అభినందించారు.

## హుస్నాబాద్‌లో అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన



**హుస్నాబాద్, సెప్టెంబర్11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెంకేపల్లి -సైదాపూర్ మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఆకునూరులో ?90 లక్షలతో కేజీబీవీ పాఠశాల డార్మెంటరీ హాల్, భవన మరమ్మత్తులు, మురికి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ?5 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి, మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్‌లు పంపిణీ చేశారు. వేంకటేశ్వర్లపల్లిలో, బూడిదపల్లిలో ఓపెన్ జిమ్‌లు ప్రారంభించగా, బూడిదపల్లిలో ?12 లక్షలతో అంగన్వాడీ భవనానికి భూమిపూజ చేశారు. ఎక్లాస్‌పూర్‌లో ?20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గ్రామాల్లో రోడ్లు, నాళాలు, అంగన్వాడీ, పంచాయతీ భవనాల నిర్మాణం జరుగుతోందని, హుస్నాబాద్ నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు తన తండ్రి పేరుతో స్టీల్ బ్యాంక్‌లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి స్టీల్ వస్తువులు వినియోగించాలని సూచించారు. ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ?500కి గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డులు వంటి పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వ బాధ్యతలో ఉందని, తగినంత అందించాలని కేంద్రమంత్రులకు విజ్ఞప్తి చేశామని, రైతులు ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు.


## లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు ప్రశంస




**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లైన్స్ ఇంటర్నేషనల్ 320జీ కరీంనగర్ మిషన్ 1.5-2025లో సభ్యత్వ లక్ష్యాన్ని చేరేందుకు సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేందుకు బొంతకుంటపల్లిలోని రిసార్ట్స్ సెంటర్లో బుధవారం సాయంత్రం లైన్స్ క్లబ్ సమావేశం జరిగింది. 320జీ గవర్నర్ సింహరాజు కోదండరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో, అత్యుత్తమ సేవలందిస్తున్న రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి బండ కిషన్ రెడ్డి, కోశాధికారి ఠాకూర్ వందన సింగ్‌లకు ప్రోత్సాహక ప్రశంస పత్రాలు అందజేశారు.

## ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ సృష్టించి డబ్బులు వసూలు ప్రయత్నం

-హెచ్చరిక జారీ చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి




**వనపర్తి,సెప్టెంబర్ 11( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేరుతో కొందరు వ్యక్తులు ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ సృష్టించి, ప్రజలకు మెసేజులు పంపుతూ డబ్బులు వసూలు చేస్తున్న ఘటన వెలుగుచూసింది. ఈ విషయం పై స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, "ఆ అకౌంట్ పూర్తిగా నకిలీది, ఎవ్వరూ నమ్మకండి. డబ్బులు ఇవ్వకండి" అని హెచ్చరిక జారీ చేశారు. ఇటువంటి మోసపూరిత కార్యకలాపాలు గమనించినవారు నేరుగా తన దృష్టికి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు మోసపోవకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.
ఫిర్యాదు చేయవలసిన ఫోన్ నెంబర్: 9494216666 అని వార్త తెలిపారు.

## నైపుణ్యాలే విజయానికి పునాది

– అడ్డగ శ్రీనివాస్




**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ ఎస్సార్ ప్రభుత్వ కళాశాలలో కెరియర్ గైడెన్స్ మరియు ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో స్కిల్స్ ఫర్ సక్సెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సైకాలజిస్ట్, కార్పొరేట్ ట్రైనర్ అడ్డగ శ్రీనివాస్ మాట్లాడుతూ, 21వ శతాబ్దపు పోటీ ప్రపంచంలో విద్యార్థులు డిగ్రీతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విలువలతో కూడిన విద్య, సానుకూల దృక్పథం, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం విజయానికి మార్గం అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విలువల విద్య ద్వారానే వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, శ్రమతోనే విజయము సాధ్యమని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్, తాళ్లపల్లి రాజయ్య లు మాట్లాడుతూ, కెరియర్ గైడెన్స్ ద్వారా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే. సుధాకర్, డాక్టర్ కాంపల్లి అర్జున్, డాక్టర్ పడాల తిరుపతి, శ్రీమతి ఎలిజబెత్ రాణి, జి. రాజేందర్, ఎం. వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మధు రాజేష్, డాక్టర్ బి. నరేష్, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ సోమ నరసయ్య, డాక్టర్ అర్చన, డాక్టర్ సునీత, డాక్టర్ శ్యామల చంద్ర, డాక్టర్ ప్రవీణ శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్లయ్య, డాక్టర్ బి. తిరుపతి, నర్మద, శిరీష, తజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

చాడ వెంకటరెడ్డి




**కరీంనగర్, సెప్టెంబర్ 11(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం వెట్టి చాకిరీ, బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన మహత్తర ఉద్యమమని, 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేసిన చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని విమోచన దినంగా, సమైఖ్యత దినంగా మార్చే ప్రయత్నాలు చరిత్రను తారుమారు చేయడమేనని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను గుర్తించి, హైదరాబాద్‌లో స్మృతివనం, స్మారక స్థూపాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయి సిపిఐ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోత్వాల్ రమేష్‌కి సైబర్ క్రైమ్ ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు



**కరీంనగర్, సెప్టెంబర్ 11 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా డీఎస్పీ కోత్వాల్ రమేష్ ఈ రోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ పదవిలో ఉన్న డీఎస్పీ వరాల నరసింహారెడ్డి హైదరాబాద్ సీసీఎస్కి బదిలీ కావడంతో, ఆసిఫాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌లో సేవలందించిన కోత్వాల్ రమేష్‌ను కరీంనగర్‌కు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ తదితర ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన రమేష్ పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు. సైబర్ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని సూచించారు. నకిలీ లింకులు, పెట్టుబడి పథకాలు, ఉద్యోగాల కాల్ లెటర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద సమాచారం ఉంటే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు.